# ఎడారిలో ఆమని

## విపుల

ఆరుబయట వెన్నెట్లో కూర్చొని వున్నది విరూప. ఆ అమ్మాయి అక్కడ ఎంతో సేపటినుండీ కూర్చొని వున్న గుర్తుగా ప్రక్కనే కొమ్మలూపుతున్న రాత్రి రాణీ చెట్లనుండి తెంపి పడేసిన పూలగుత్తులు రాశిగా పడివుండటమే దానికి నిదర్శనం.

ఆమె వదనం, నిరాశా, నిట్టూర్పులతో బాధా వీచికలతో నిండి వున్నదనటానికి నిదర్శనంగా కృంగి వాడినట్లున్నది. ఆలోచించి, ఆలోచించి తల బద్దలయేంత భారంగా అన్పిస్తోంది.

చంద్రుడు ఈ లోకంతో నాకేం పనిలేదు. మీరెన్ని బాధల వలయంలో చుట్టుకున్నాగాని వాటితో నాకేం పనిలేదు సుమా నా డ్యూటీ నేను చేయక తప్పదు. నా కర్తవ్య లోపమేమీ ఉండదు సుమా. అన్నట్లు తన చల్లని కిరణాలను ప్రసరిస్తూ వున్నాడు. కనీసం తన శీతల కిరణాలతో నన్నా మీ సమస్యల నుండి సేద తీరండి. అంతకన్నా నేను చేయగల సాయమేమీ లేదన్నట్లుగా చిరునవ్వులు ఒలకబోస్తూనే వున్నాడు.

ఎంత చల్లని వెన్నెల కిరణాలయినా తాత్కాలిక ఉపశమనమేగా, మళ్ళీ తెల్ల వారితే నువ్వేమీ చేయలేవుగా అన్నట్లుగా విరక్తిగా నవ్వాయి విరూప పెదవులు.

అవును. తెల్లవారితే తనేమి చేయాలి. ఏం నిర్ణయించు కోవాలి. వాళ్ళకి ఏమని జవాబు చెప్పాలి

మనుష్యులు ఇంత సమయానుకూలంగా ప్రవర్తిస్తారని తనకింతవరకూ తెలియదు.

ఇన్ని రోజులూ ఏమైపోయారు. ఈ కన్నవాళ్ళమంటున్న వాళ్ళు. ఇంతకాలమూ వాళ్ళే తన కన్న తల్లిదండ్రులనుకుంటుంది. ఏనాడూ తనుకలలో కూడా అనుకోలేదు. వాళ్ళు తనను పెంచి, పెద్దచేసిన వాళ్ళేనని. కన్నవాళ్ళు వేరేవున్నారనీ. వాళ్ళూ అలా భావించలేదు. అలా చూడలేదు. అంత అనురాగంగా, అభిమానంగా, వారి ప్రాణానికి ప్రాణంగా చూసుకున్నారు తనను అమ్మా— నాన్న. ఎలా అనుకుంటున్నది వాళ్ళు కన్నవాళ్ళు కాదని. వారి ప్రేమ, మమతను ఎలా మర్చిపోగల్గుతుంది. మర్చిపోగలిగే బంధమా ఇది. కన్న ప్రేమకంటే పెంచిన ప్రేమ గొప్పదంటారు. ఇదేనేమో!

అందరిలాంటి బ్రతుకే తనదికూడా అయితే ఇన్ని సమస్యలు ఉండేవే కావనుకుంటాను. తనపుట్టుక లోకంలో లేనివింత, విచిత్రం. తన పుట్టినప్పటి రూపం అందరిలా లేకపోవడమే ఆ వింత, విచిత్రమున్నూ.

అది తల్చుకుంటే ఇప్పటికీ ఒళ్ళు జలదరిస్తుంది.

### కథ వెనుక కథ



కథ ప్రాధాన్యత కోల్పోతున్న రోజుల్లో కొత్త తరహా కథల్ని రాయాలని ప్రయత్నం చేస్తున్నాను. ఒక పత్రికలో 'అమరావతిలో వింత శిశువు' అనే వార్తాప్రకటన నన్నాకర్షించింది. దానిపై మూడు రాత్రులు ఆలోచించి ఈ కథకు ఓ రూపం ఇవ్వడం జరిగింది. వాస్తవంతో ముడిపడివున్న ఈ కథ అందర్నీ ఆలోచింప జేస్తుందని నా ఆశ.

బయోడేటా: కథలు, కవితలు వ్రాయడం ఆసక్తి. ఎలక్ట్రానిక్ కార్పొరేషన్‌లో ఉద్యోగం నాకు, శ్రీవారికి కూడా! ఇద్దరు చిరంజీవులు. అడ్రస్: శ్రీమతి విపుల నారాయణ, వైఫాఫ్ శ్రీ లక్ష్మీనారాయణ, ఇ.సి.ఐ.ఎల్ హైదరాబాద్.

గగుర్పొడుస్తుంది.

"అబ్బ! ఈ తలనొప్పి అదిరి పడేట్టు చేస్తుంది. తను ఎక్కువగా ఆలోచించకూడదని డాక్టర్లు చెప్పారు. అవును. ఆలోచిస్తే తప్పదు ఈ నెప్పి. కణతల్నిఅదరగొట్టే ఈ నొప్పిని తను నిద్ర అనే మందుతో తప్ప తగ్గించలేదు. లాభం లేదు. అని నిట్టూర్చి మంచమ్మీద చేరుతూనే బలవంతంగా కళ్ళు మూసుకుంది విచిత్ర విరూప.

* * *

ఏమిటిది. ఇన్ని రోజులూ విరూప మీద పెట్టుకున్న ఆశలన్నీ కల్లలు కావల్సిందేనా! ఎంత ఆపేక్షగా చూసుకున్నది తాను విరూపను. విరూప తన బిడ్డకాదని తనకేనాడూ అన్పించలేదు. తమ రక్తం పంచుకుని పుట్టిన బిడ్డగానే చూసుకున్నారు తనూ, భర్త. ఇలా ఏదో ఒకరోజు, ఇలాంటి రోజు ఎదురౌతుందని తనకేనాడూ అన్పించలేదా. ఉహూ! అలాగని తెల్సివుంటే ఏం జరిగుండేది? విరూపను తను మనస్ఫూర్తిగా దగ్గరకు తీయగలిగేదా! ఏమో! ఏమిటీ విపరీతమైన ఆలోచనలు. ప్చ్! ఏమిటో ఈ బాధలు. ఈ సమస్యలు దీనికి పరిష్కారమేమిటి? తీవ్ర ఆలోచనలలో మునిగివున్న మీనాక్షమ్మ భుజమ్మీద చేయిపడడంతో తిరిగి చూచింది. భర్త మాధవరావు నిలబడి వున్నాడు. ఆయన ముఖంలో అలసట, ఆవేదన.

"మీనా" భర్త అనునయింపు స్వరం వినగానే బలవంతాన ఇంతసేపటినుండీ బిగపట్టుకున్న దుఃఖం వరదలా కట్టలు త్రెంచుకొన్నది. ఆయన చేతులలో ముఖం దాచుకుని బావురుమన్నది. మౌనంగా ఆమె దుఃఖం తగ్గేవరకూ తలనిమురుతూ వుండడం తప్ప ఆయనేం చేయలేదు. అలా మనసులో వున్న బాధనంతా తీర్చుకోవడమే మంచిదను కున్నారాయన.

"మీనా! ఏమిటి ఈ పిచ్చి. ఎందుకింతగా బాధపడతావు. ఇలాంటి రోజు ఎప్పుడో ఒకప్పుడు ఎదురౌతుందని మనకి తెల్సుకదా. ఇలా బాధపడడంలో అర్థం లేదు ఊరుకో."

"ఏమిటండీ! మీకే ఇలా బాధ లేనట్లు మాట్లాడుతున్నారేమిటి. అంటే... మీరు దీనికి సిద్ధపడే వున్నారా" కళ్ళల్లో నిరాశా, బాధా కదుల్తుండగా అడిగింది.

ఔనన్నట్లుగా మౌనంగా తలూపారు ఆయన. ఎంతో శక్తిని కూడ దీసుకోవాల్సి వచ్చింది ఆయన అలా అంగీకరించడానికి.

మీనాక్షమ్మ నిరుత్తరురాలే అయింది.

* * *

ఉదయాన ఆఫీసుకు బయల్దేరుతున్న మాధవరావుకు ఎదురైన విరూపను అడిగారు.

"ఏమ్మా! ఏమని నిర్ణయించుకున్నావు?"

కళ్ళెత్తి చూసిన విరూప కళ్ళల్లో నిశ్చలమైన భావం! తన నిర్ణయాన్ని ఎవరూ మార్చలేరన్న ధీమా.

విరూపనోటి వెంట వచ్చే మాటకోసం, ఒళ్ళంతా చెవులు చేసుకుని ఆత్రంగా గుండెలు చిక్కబట్టుకుని చూస్తున్నారు మీనాక్షమ్మ, మాధవరావులు.

"ఇంకా క్రొత్తగా నిర్ణయించుకొనేదేముంది నాన్నగారూ! ఇదివరకే చెప్పేశాను నా నిర్ణయం." నిశ్చలంగా అంటున్న విరూపను చూస్తే బీటలువారిన మనసుల మీద పన్నీరు చిలికినట్లయింది.

"అమ్మా! విరూపా!" సంభ్రమం నిండిన కంఠంతో

అంటూ "అమ్మా! మరొక్కసారి ఆలోచించుకోమ్మా. ఎంతయినా వారు నీ కన్న తల్లిదండ్రులు."

"కన్నవాళ్ళా! ఎవరు నాన్నగారు ఆ కన్నవాళ్ళు. పుట్టినపుడు వికృతంగా వున్న రూపాన్ని చూసి అసహ్యించుకొని కళ్ళయినా తెరవని పసిగుడ్డనైనా చూడకుండా నిర్దాక్షిణ్యంగా అలా హాస్పిటల్లోనే వదిలేసి వెళ్ళిన వాళ్ళేనా నా కన్నవాళ్ళు. ఇన్ని సం.లూ ఏమై పోయిందంటా ఆ కన్నప్రేమ. వికృతంగా వున్నానని చూడకుండా నన్నుతెచ్చి పెంచిపెద్ద చేసి, ఎన్నో కష్ట, నష్టాల కోర్చి లోకంలో ఏ కన్నతల్లిదండ్రీ పడని ఆవేదన, ఆందోళనలతో నన్ను పెంచి పెద్దచేసి మమతానురాగాలు పంచి ఇచ్చిన మీరు నాకు పరాయి వాళ్ళా నాన్నగారూ! ఇప్పుడు ఈ వృద్ధాప్యంలో ఆశలు, కలలు అన్నీ నా చుట్టూగా అల్లుకొని



బ్రతుకుతున్న మిమ్మల్ని ఒంటరిగా వదిలేసి ఎలా వెళ్ళమంటారు నాన్నగారూ!"

"అమ్మా! అలాగేనమ్మా, మాదేముంది. ఎప్పటికైనా మాకీ పరిస్థితి తప్పదమ్మా. నీ మీద ఎంతో ఆశతో వచ్చినవాళ్ళను నిరాశ పరచకమ్మా..." నచ్చజెప్పటానికి ప్రయత్నించారు ఆయన.

"వద్దు. నాన్నగారూ! మీరెన్ని చెప్పినా నా నిశ్చయం ఒకటే" స్థిరంగా అనేసి అక్కడి నుండి వెళ్ళిపోయింది.

వారికి ఎంతో ఆనంద దాయకమైన ఆమె ఈ నిశ్చయం ఒక ప్రక్కనుండి మళ్ళీ భయంకరంగా కన్పించసాగింది. వాళ్ళే మంటారో దీనికి. ఏం చేయాలిష్మీ ఎటూ తోచడం లేదు వాళ్ళకు. ఇద్దరి మనసులలోనూ భయాందోళనలు క్రమ్ముకోగా ఒకరికి ఒకరు కళ్ళతోనే ధయిర్యం చెప్పుకోసాగారు.

* * *

సరిగ్గా ఇరవైయేళ్ళ క్రితం మీనాక్షి గవర్నమెంట్ హాస్పిటల్ లో నర్సుగా చేస్తున్న రోజులవి. తన వార్డులో క్రొత్తగా జాయినయిన కల్పనాదేవి కేసు షీట్ చూస్తూ ఆవిడ్ని గమనించింది మీనాక్షి. ఆవిడతో పరిచయం ఏర్పడింది. ఆవిడది డెలివరీ కేసు.

ఒంట్లో కొంచెం నలతగా వుండడంతో రెండు రోజులు సెలవు తరువాత ఆ రోజే డ్యూటీలో జాయిన్ అయిన మీనాక్షికి ఒక వార్త తెలిసింది. గబగబా వెళ్ళి అందరూ చూస్తున్న ఆ చిత్రం తనూ చూసింది. కాళ్ళూ, చేతులు మొత్తం శరీరమంతా బాగానే వున్నా మొహం మాత్రం విచిత్రంగా ... మొఖానికి అది నోరేనా అన్నట్లు చిన్న రంధ్రం, అటూ, ఇటూ చిన్నచెవులు రెండు తప్పించి ఆ బిడ్డ ముఖంలోఏమీ లేదు. కళ్ళు, ముక్కు వుండవల్సిన చోట అవిలేవు. అంతా సమతలంగా వుంది. ఆ బిడ్డ ముఖం. విచిత్రమైన పుట్టుక. అందునా ఆడపిల్ల. ముఖంలో రూపురేఖలు లేకున్నా ఆ పిల్ల మాత్రం బాగా బలంగా వున్నది.

ఇలాంటి ఆడపిల్లని పెంచడం కష్టమని కల్పనాదేవి ఆ పిల్లను హాస్పిటల్ లోనే వదిలేసి వెళ్ళిపోయింది.

ఈ విచిత్రమైన కేసు సిటీలో ఉన్న డాక్టర్లకు చర్చనీయాంశమైనది. డ్యూటీలో ఉన్నంత సేపూ ఆ పిల్ల ఆలనా, పాలనా మీనాక్షి చూసేది. ఆ పిల్ల ఏడిస్తే చిన్న

శబ్దం వచ్చేది. మూతి అనబడే ఆ చిన్నరంధ్రంలో నుండి కొద్దికొద్దిగా పాలుపోసి తాగిస్తుండేది మీనాక్షి. క్రమంగా ఆ పిల్లఅంటే జాలి, సానుభూతి, ప్రేమ, కరుణ కలుగసాగాయి ఆవిడకు. క్రమంగా ఆమె మనసులో ఒక భావం చోటుచేసుకో నారంభించింది. ఆలోచించి తన నిర్ణయాన్ని ఆమె భర్తకు తెలిపింది.

"మీనా. ఇందుకే ఇవ్వలేదేమో మనకు బిడ్డల్ని ఆ భగవంతుడు. నీ నిర్ణయానికి నా సహాయమెప్పుడూ వుంటుంది. తల్లీ, దండ్రీ దూరమైన ఆ పిల్లని మనం పెంచుదాం" ఆమె భర్త మాధవరావు తన అభిప్రాయాన్ని తెలిపారు. ఆ పిల్లను గురించి మీమాంసలో పడ్డ హాస్పిటల్ అధికారులకు మీనాక్షి తీసుకొని వెళ్తాననడంతో వెంటనే అంగీకరించారు.

'విరూప' అని నామకరణం చేసి పెంచసాగారు ఆ పుణ్యదంపతులు. వైద్యరంగం ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో డాక్టర్లు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి క్రమంగా నోరు స్థానంలో ఉన్న రంధ్రాన్ని కొంచెం పెద్దదిగా చేయ లిగారు. ఇంకా ఎన్నో ఆపరేషన్‌లు చేసి క్రమంగా, ముక్కును, కళ్ళను అమర్చగలిగారు. విరూపను పెంచడంలో మీనాక్షి, మాధవరావులకు ఎన్ని సమస్యలెదురైనా ఏనాడూ విసుక్కోలేదు నిరాశ చెందలేదు. పైగా భయపడకుండా ఎంతో ఉత్సాహంగా డాక్టర్లకు సహకరించారు.

విరూప ఆపరేషన్ల కయ్యే ఖర్చంతా హాస్పిటల్ అధికారులే అది ఒక ఛాలెంజ్‌గా తీసుకొని నిర్వహించారు. ఎన్నో అవరోధాల నెదుర్కొంటూ ఈనాటికి విరూప అందర్లాంటి ఆడపిల్లగా నిలబడ గల్గింది. దానికి సహకరించి, తనను పెంచి, పెద్దచేసిన తల్లిదండ్రీ అంటే ఎంతో ప్రాణం విరూపకు. వారి ప్రోత్సాహంతో ఎక్కువ శ్రమ లేకుండానే ఇంటర్ వరకు చదువుకో కల్గింది. ఇన్ని రోజులూ కన్నబిడ్డ ఏమైంది, ఎలా వుంది అని తొంగి చూడని కల్పనాదేవి, కేశవరావులు ఈనాడు మా బిడ్డ మాకు కావాలంటూ వచ్చారు.

ఏం జవాబు చెప్పాలో తోచక సందేహంలో పడ్డారు మీనాక్షి, మాధవరావులు. చివరికి నిర్ణయాన్ని విరూపకు వదిలారు.

అంతా విన్న విరూప నిరుత్తరు రాలయింది. ఏమిటి ఇన్నాళ్ళు తనని కంటి రెప్పలా కాపాడి పెంచిన వాళ్ళు తన కన్నవాళ్ళు కారా! ఏనాడో వదిలేసి, వెళ్ళిపోయి ఈనాడు నేను కావాలంటూ వచ్చిన వాళ్ళా తన కన్నవాళ్ళా. ఇదెక్కడి న్యాయం. ఇన్ని రోజులూ లేనికూతురు ఇప్పుడెలా గుర్తుకొచ్చింది వాళ్ళకు. నో! అలా జరగడానికి వీల్లేదు. ఒక నిర్ణయానికి వచ్చిన విరూప మళ్ళీ తనను నమ్మని అడగడానికి వచ్చిన కేశవరావుతో తన నిర్ణయాన్ని చెప్పేసింది.

"అంటే. అంతా నీ ఇష్టమే ననుకున్నావా" కోపంగా అరిచాడు కేశవరావు. "కాకపోవచ్చు. చిన్నప్పటి నుండీ నన్ను కన్నవాళ్ళు వదిలి వెళ్ళిన ఈ వికృత రూపాన్ని పెంచిన వాళ్ళను ఈ వృద్ధాప్యంలో ఒంటరి వాళ్ళను చేసి రాలేను. అంత కృతఘ్నురాల్ని కాలేదు. క్షమించండి."

"అవును. వదిలి వెళ్ళాము. అప్పుడు అలా వున్నావని అందులో ఆడపిల్లవని పెంచి, పెద్దచేయడం కష్టమని వదిలి వెళ్ళాము. ఇప్పుడు బాగానే వున్నావు కదాని రమ్మంటున్నాము. ఇందులో తప్పేముంది?"

"అదే నేనూ అంటున్నాను. అప్పుడు పనికిరాని నేను ఇప్పుడేలా పనికి వచ్చాను. మీరు కన్న ఆ వికృత రూపం ఆనాడే చచ్చిపోయిందనుకోండి. నేను ఎక్కువ వాదించలేను. నేను రాను. దయచేసి వెళ్ళిపోండి" రెండు చేతులెత్తి నమస్కరించి లోపలికి వెళ్ళిపోయింది.

"చూస్తాను. నువ్వు ఎలా రావో. కోర్టుద్వారా నైనా రప్పించుకుంటాను." క్రూరంగా మాధవరావు దంపతుల వైపు చూస్తూ వెళ్ళిపోయాడు కేశవరావు.

* * *

కేశవరావు అన్నట్లుగానే ఆ దంపతుల మీద కోర్టులో కేసు పెట్టాడు. దీనికి మరీ క్రుంగిపోయారు ఆ దంపతులు. నిరాశతో బాధపడ్తున్న ఆ ఇద్దర్నీ చిన్న పిల్లల్ని లాలించినట్లు బుజ్జగించి ధయిర్యం చెప్పింది విరూప. అంతేకాదు కోర్టు లేకుండా తన నిర్ణయానికి కారణాలు, తను పుట్టిన దగ్గర నుండి ఆ పుణ్య దంపతులు తనను ఎలా పెంచి, పెద్దచేసింది, ఏ విధంగా తనను మనిషిని చేసింది అన్నీ వివరించింది. అంతా క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కోర్టు వారి నిర్ణయాన్ని విన్న మాధవరావు దంపతులకు హృదయాలు ఆనందంతో పులకరించాయి. తమ బ్రతుకులో చివరి ఘట్టం నిరాశతో గడపాలి అనుకున్న వారి బ్రతుకులో విరూపమీద సర్వహక్కులూ మాధవరావు దంపతులకే చెందుతాయన్న కోర్టు తీర్పు ఎండిన హృదయాలకు పన్నీటి జల్లులా తోచింది. *

